సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 17 । జనవరి । 2023



ప్రజల ప్రాణాలతో చెలగాటం
సంపాదనే ధ్యేయంగా పాలు, అల్లం ఇతర నిత్యావసర వస్తువులను కల్తీ చేస్తున్నారు అక్రమార్కులు.
- 8లో



యాదాద్రిలో భక్తుల రద్దీ
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.
- 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32°/16°
ఉదయం ఆకాశం పొగమంచుతో మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

హైవే అధ్వానం!

అసంపూర్తిగా హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి

- ఆరేళ్లయినా పూర్తికాని విస్తరణ పనులు
- ప్రమాదకరంగా మలుపులు
- అండర్‌పాస్‌లు, సైడ్ బర్మ్‌లు, బ్రిడ్జీలు, విద్యుదీకరణ పెండింగ్
- ఇబ్బందికరంగా ప్రయాణం



అండర్‌పాస్ నిర్మించాల్సిన వంగపల్లి జంక్షన్, రోడ్డుపై కంకర తేలిన దృశ్యం

సాక్షి, యాదాద్రి : ఆరేళ్లుగా సాగుతున్న సాగుతున్న హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు వాహనదారులకు అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.అండర్‌పాస్‌లు, సైడ్ బర్మ్‌లు, బ్రిడ్జీలు, విద్యుదీకరణ, సూచిక బోర్డులు, మూలమలుపుల వద్ద పనులు పూర్తి కావాల్సి ఉంది. వాహనదారుల నుంచి ముక్కు పిండి టోల్‌ఫీజు వసూలు చేస్తున్న జాతీయ రహదారి నిర్మాణ సంస్థ.. విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేయడంలో విఫలమైందన్న విమర్శలున్నాయి.

రాయగిరి నుంచి వరంగల్ వరకు
జాతీయ రహదారి 163 తెలంగాణ - ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల మధ్య ప్రధాన రహదారి. కేంద్ర జాతీయ రహదారుల అధికార సంస్థ 99.6 కిలో మీటర్ల మేర రూ.897.03 కోట్లతో విస్తరణ పనులు చేపట్టింది. హైదరాబాద్ నుంచి వరంగల్ మార్గంలో యాదాద్రి జిల్లా రాయగిరి నుంచి వరంగల్ జిల్లా ఆరెపల్లి వరకు రెండు వరుసల్లో నాలుగు లేన్లుగా చేపట్టారు. 2016 జూన్ 1న పనులు ప్రారంభించారు. 2018 నవంబర్ 27 నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ, పనుల్లో జరుగుతున్న జాప్యం వల్ల 2019 మార్చి వరకు గడువు పొడిగించారు. అయినా కొన్ని పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

సిమెంట్, దాంబరుతో రోడ్డు : 163వ నంబర్ జాతీయ రహదారిని దేశంలోనే మొదటిసారిగా ప్రయోగాత్మకంగా సిమెంట్‌తో చేపట్టారు. కొన్ని కిలో మీటర్లు సిమెంట్ కాంక్రీట్, మరికొంత దూరం దాంబరుతో పూర్తి చేశారు.

పెండింగ్ పనులు
విద్యుత్, బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు, సైడ్ బర్మ్‌లు, డివైడర్ల పనులు పూర్తికాలేదు. జంక్షన్ల వద్ద విద్యుత్, సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల సైడ్ బర్మ్‌లు వర్షాలకు కోతకు గురయ్యాయి. మరి కొన్ని ప్రాంతాల్లో బర్మ్‌లు ఏర్పాటు చేయలేదు.

రోజూ 50వేల వాహనాల రాకపోకలు
హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిని హైదరాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, జనగామ, వరంగల్ జిల్లాల వరకు 99.6 కిలో మీటర్ల మేర విస్తరించారు. ఈ రహదారిపై రోజూ 50వేల వాహనాల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. యాదాద్రి జిల్లా పరిధిలో గూడూరు, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెంకటాయపాలెం వద్ద టోల్‌గేట్‌లు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. కానీ, అందుకు అనుగుణంగా సరైన వసతులు కల్పించడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

మలుపుల వద్ద బాగు చేయాలి



జాతీయ రహదారి నుంచి ఆలేరులోకి మళ్లే చోట రోడ్డు వెడల్పు తక్కువగా చేశారు. భారీ వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ కంకర, మట్టి తేలడం, రోడ్డు నిర్వహణ సరిగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కిందపడుతున్నారు. అలాగే రోడ్డు దిగే చోట విద్యుత్ లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద బాగు చేయాలి.
–బందెల సుభాష్, ఆలేరు

భయంతో రోడ్డెక్కుతున్నాం



మాది మహబూబ్‌పేట. నేను వివిధ పనుల నిమిత్తం, మండల, జిల్లా కేంద్రాలకు బైక్‌పై వెళ్లొస్తుంటాను. వంగపల్లి వద్ద అండర్ పాస్ నిర్మించకపోవడం, కంకరతో వదిలేయడంతో రోడ్డు క్రాస్ చేయాలంటే భయంగా ఉంటుంది. వంగపల్లి - మోటకొండూర్ వెళ్లే దారికి అండర్‌పాస్ నిర్మిస్తే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చు. హైవే సంస్థ స్పందించి త్వరగా అండర్‌పాస్ నిర్మించాలి.
–కసాగు సిద్దులు, ప్రయాణికుడు

ప్రమాదకరంగా బైపాస్‌లు

వంగపల్లి బైపాస్ వద్ద అండర్‌పాస్ పనులు మొదలుకాలేదు. అతివేగంతో వచ్చిన వాహనాలు వంగపల్లి వద్దకు రాగానే అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని హైవే దాటాల్సి వస్తుంది. లైటింగ్, సూచికలు సరిగ్గా లేవు. కంకర రోడ్డు ఉందన్న విషయం తెలియక, వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆలేరులోకి వెళ్లే మలుపు వద్ద పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.



ఆలేరులోకి వెళ్లే మలుపు వద్ద ప్రమాదకరంగా రోడ్డు

వందేభారత్‌కు ఘన స్వాగతం

- భువనగిరిలో జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి
- రైలును చూడడానికి తరలివచ్చిన ప్రజలు



వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, జిల్లా కోర్టు జీపీ అంజయ్య

సాక్షి, యాదాద్రి : తెలుగు రాష్ట్రాల మధ్య ప్రారంభమైన సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సంక్రాంతి పర్వదినాన యాదాద్రి భువనగిరి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఉదయం 10.30 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా రైలును ప్రారంభించారు. తొలి రోజు సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన రైలు.. ఉదయం 11 గంటలకు భువనగిరికి చేరుకుంది. భువనగిరి రైల్వే స్టేషన్‌లో ఒక నిమిషం హాల్టింగ్ ఇవ్వడంతో పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు రైలును చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులు,పెద్దలు కేరింతలు కొడుతూ జాతీ జెండాలను ప్రదర్శిస్తూ వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. స్టేషన్‌లోకి రైలు రాగానే నినాదాలు చేస్తూ సెల్ఫీలు, వీడియోలు తీసుకున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తమ స్నేహితులు, బంధువులతో సంతోషం పంచుకున్నారు. అలాగే భువనగిరి, రాయిగిరి, వంగపల్లి, ఆలేరు రైల్వే స్టేషన్‌లకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వందేభారత్‌కు స్వాగతం పలికారు.

తొలిరోజు విద్యార్థులతో..
కేంద్ర ప్రభుత్వ సంస్థల విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో తొలిరోజు ప్రయాణం జరిగింది. పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. కేంద్రీయ విద్యాలయాలు, రైల్వే విద్యాలయాలకు చెందిన విద్యార్థులను సికింద్రాబాద్ నుంచి విజయవాడ వరకు తీసుకెళ్లారు. కొత్త రైలు కావడంతో ప్రతి కంపార్ట్‌మెంట్‌లో సాయుధులైన పోలీసులు ఉన్నారు.టికెట్ కలెక్టర్లు, రైల్వే సిబ్బంది ప్రయాణికులకు వసతులను సమకూర్చారు.

పచ్చజెండా ఊపిన ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి
భువనగిరి నుంచి జనగామ వెళ్లేందుకు రెండో నెంబర్ ప్లాట్‌ఫాం ఆగిన వందేభారత్ రైలుకు ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి పచ్చజెండా ఊపారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్లు పంగరెక్కల స్వామి, జిల్లా జీపీ నాగారం అంజయ్య, సీనియర్ న్యాయవాది బొబ్బల కేశవరెడ్డి ఉన్నారు. వీరితో పాటు బీజేపీ నాయకులు నర్ల నర్సింగరావు, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, మాయ దశరథ, చందామహేందర్‌గుప్తా, నీలం రమేష్, ఉమాశంకర్, రత్న పురం బలరాం, ఎండీ మహమూద్, రచ్చ శ్రీనివాస్, బందెల సుభాష్, పాలకుర్తి వేణు, కాంగ్రెస్ నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, పడిగెల ప్రదీప్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అత్యధిక దూరం ప్రయాణం
దేశంలో ఇప్పటివరకు ఏడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. విశాఖపట్నం - సికింద్రాబాద్ (నం.20833/20834) ఎనిమిదో రైలు. ఢిల్లీ - కట్రా మధ్య నడిచే వందేభారత్ ఇప్పటివరకు అత్యధిక దూరం (655 కి.మీ) ప్రయాణించే రైలు. తాజాగా సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ దేశంలో అత్యధిక దూరం నడిచే రైలు (698.5కి.మీ)



భువనగిరిలో రైలుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

కంపార్ట్‌మెంట్‌లోకి పలువురికి ఆహ్వానం
తమ ఆహ్వానం మేరకు వచ్చిన వచ్చిన ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డితోపాటు పలువురిని ఏడీఆర్ఎం రాజీవ్‌గోగ్లే వందేభారత్ రైల్ బోగిలోకి ఆహ్వానించారు. బోగిలోఉన్న ప్రత్యేకతలను వివరించారు. అంతకుముందు స్థానిక నాయకులకు రైల్వే అధికారులు, సిబ్బంది బ్యాండ్ మేళాలతో స్వాగతం పలికారు. బీజేపీ నాయకులు రైలు డ్రైవర్లను పూలదండలతో సత్కరించి వారికి స్వీట్లు పంపిణీ చేశారు. ఇంజన్‌పై పూలు చల్లి స్వాగతం పలికారు. బెలూన్లు వదిలారు. రైల్వే సీఐ ఏకే సిన్హా, ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల కమిషనర్ రాక

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌కుమార్ ఖాచి మంగళవారం రానున్నారు. ఉదయం 9.30 గంటలకు యాదాద్రికి చేరుకొని 11గంటలకు శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు. 11.15కు హైదరాబాద్‌కు తిరుగుపయం అవుతారు.

తిరుగు పయనం రద్దీ



ప్రయాణికులతో కిక్కిరిసిన భువనగిరి బస్టాండ్

భువనగిరి : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన జనం తిరిగి సోమవారం హైదరాబాద్ నగరానికి వెళ్లడం ప్రారంభించారు. ఇందులో భాగంగా భువనగిరి బస్టాండ్‌లో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూశారు. సరిపడ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

అడవి జంతువుల దాడిలో జింక మృతి



పంచనామా చేస్తున్న అటవీ అధికారులు

రామన్నపేట : అడవి జంతువుల దాడిలో జింక మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారు జామున మండలంలోని ఎన్నారంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా.. గ్రామ శివారులోని ముస్కు సుదర్శన్‌రెడ్డి పొలంలో ఉదయం 6గంటల సమయంలో జింక చనిపోయి ఉంది. జింక శరీరం వెనుకభాగంలో క్రూరమృగాలు దాడి చేసిన గాయాలు ఉన్నాయి. స్థానికుల సమచారం మేరకు అటవీ అధికారులు శ్రీనివాస్, శంకర్‌నాయక్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. వారివెంట పశువైద్యాధికారి డాక్టర్ శాంతిబాబు, సర్పంచ్ మెట్టు మహేందర్‌రెడ్డి, గోపాలమిత్ర ముత్తయ్య తదితరులు ఉన్నారు.

నిర్వాసితుల వినూత్న నిరసన



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులు

భువనగిరి : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపుకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులు చేపట్టిన నిరాహార దీక్షలు 79వ రోజు కొనసాగాయి. దీక్షల్లో భాగంగా సోమవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నిర్వాసితులకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించని పక్షంలో ఈ నెల 20న కలెక్టరేట్‌కు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిన్నం లత, ఎంపీటీసీ ఉడుత శారద, మాజీ సర్పంచ్ రావుల నందు, నిర్వాసితులు మహేందర్, ప్రభాకర్, సత్తిరెడ్డి, చిన్న, జమ్మయ్య, నర్సింహ్మ, హరినాథ్, సుధాకర్, పరమేష్, బలరాం రాములు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. ఉదయం మహాశివుడికి అభిషేకం, అర్చన, హోమ మండపంలో అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం చేపట్టారు. అనంతరం పూర్ణాహుతి, గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి హారతినిచ్చారు. పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో అదనపు కలెక్టర్, హాజరైన అధికారులు

- కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి : కంటి వెలుగును విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 18న సీఎం కేసీఆర్ ఖమ్మంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, జిల్లాలో 19నుంచి మొదలవుతుందన్నారు. జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సమన్వయంతో జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమన్వయంతో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. శిబిరాల వద్ద నిరంతర విద్యుత్, మంచినీరు, మూత్రశాలలు, టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల వద్ద రద్దీ లేకుండా పోలీస్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల అడ్రస్ తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని, పరీక్షలకు వచ్చేవారు ఆధార్ కార్డు తెచ్చుకునేలా ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. శిబిరం నిర్వహణ తేదీ, ప్రదేశం వివరాలు తెలియజేసేందుకు ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు అందజేయాన్నారు. ఏ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్ 8685293312 అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీసీపీ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

భువనగిరి పెద్దచెరువు పరిశీలన

భువనగిరి : భువనగిరి పెద్దచెరువును సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. చెరువు సుందరీకరణలో భాగంగా కట్టపై చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కట్టపై లవ్ భువనగిరి ఆర్చితో పాటు జాతీయ జెండా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ – వరంగల్ మార్గంలో ఉన్నందున సందర్శకుల తాకిడి పెరిగే అవకాశం ఉంద న్నారు. అదే విధంగా హైదరాబాద్, నల్లగొండ చౌరస్తాలోని కూడళ్లను అభివృద్ధి చేసి సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ఆమె వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఉన్నారు.



కట్టపై పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

బీఆర్ఎస్ సభపై ఫోకస్

ఉమ్మడి జిల్లా నుంచి 1.50 లక్షల మందిని తరలించేందుకు సన్నాహాలు

- ఒక్క సూర్యాపేట జిల్లా నుంచే 1.20 లక్షల మంది టార్గెట్
- పార్టీ నేతలకు మంత్రి జగదీశ్‌రెడ్డి దిశానిర్దేశం
- విస్తృతంగా సన్నాహక సమావేశాలు





హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఖమ్మంలో ఈ నెల 18న జరగనున్న బీఆర్ఎస్ పార్టీ తొలి జాతీయ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా అవతరించిన తర్వాత మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా ఆ పార్టీ ముఖ్య నేతలు భారీగా జనాన్ని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అత్యధికంగా సూర్యాపేట జిల్లా నుంచి
ఉమ్మడి జిల్లా నుంచి లక్షన్నర మంది పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులో సూర్యాపేట జిల్లా నుంచే 1.20 లక్షల మంది వెళ్లేలా ముఖ్య నాయకులు సమన్వయం చేస్తున్నారు. ఇటీవల మంత్రి జగదీశ్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు బీఆర్ఎస్ మహాసభకు స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తూ సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కూడా ముఖ్య నేతలతోపాటు నియోజకవర్గ నాయకులతో కూడా మంత్రి జగదీశ్‌రెడ్డి సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ పార్టీ మొదటి జాతీయ మహాసభకు పెద్ద ఎత్తున జనాలు స్వచ్ఛందంగా తరలి వెళ్లే విధంగా దిశానిర్దేశం చేశారు. దీంతో నాయకులంతా ఆయా గ్రామాలు, మండలాల వారీగా సభకు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి 30వేల మంది చొప్పున 1.20 లక్షల మంది ఖమ్మం సభకు హాజరు కానున్నారు. ఖమ్మం జిల్లా నుంచి ఆనుకొని ఉన్న జిల్లాలు వంద కిలోమీటర్ల నుంచి మాత్రమే జనాలు సభకు హాజరుకావాలని నిబంధన పెట్టడంతో అత్యధికంగా సూర్యాపేట జిల్లా నుంచే 1,500 పెద్ద వాహనాలైన డీసీఎంలు, లారీలు, చిన్నవాహనాలు, కార్లలో సభకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కూడా సన్నాహక సమావేశంలో పాల్గొని మొదటిసభ విజయవంతానికి కార్యకర్తలు, నాయకులను సమాయత్తం చేస్తున్నారు. ఇక బహిరంగసభకు నల్లగొండ, యాదాద్రి జిల్లాల నుంచి 30వేల మందికిపైగా ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉత్సాహంగా కార్యకర్తలు
ఇప్పటికే రాష్ట్రంలో రెండుసార్లు ఘన విజయం సాధించిన టీఆర్ఎస్ పార్టీని జాతీయ స్థాయిలో కూడా రాణించేందుకు బీఆర్ఎస్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బహిరంగంగానే ఎండగడుతూ వస్తున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా వేధిస్తోందని దుయ్యబడుతున్న విషయం తెలిసిందే. దీంతో జాతీయ స్థాయిలో కూడా పార్టీని బలోపేతం చేసి తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశవ్యాప్తంగా ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ పార్టీగా మార్చారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలో మొట్ట మొదటిసారిగా జాతీయ మహాసభ నిర్వహించబోతున్నారు. అయితే ఈ సభకు తరలి వెళ్లేందుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం చెబుతారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన



పార్టీలో చేరినవారితో పీసీసీ కార్యదర్శి బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్ : రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని టీపీసీసీ కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీర్ల అయిలయ్య విమర్శించారు. కొలనుపాకలో గల రాజనగరంలో సోమవారం పలువురు బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీనివాస్ రాజు రవి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్ సమీపంలో కేన్సర్ ఆస్పత్రి



మాట్లాడుతున్న స్వామీజీ

బీబీనగర్ : బీబీనగర్ పరిధిలోని ఇస్రాయిపల్లికుంట వద్ద సర్వే నంబర్‌లో 517లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయనున్న కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి సత్యసాయి ట్రస్టు గురువు స్వామీజీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ బారిన పడిన ఎంతో మంది నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పరి స్థితిలో ఉన్నారని తెలిపారు. మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో భగవాన్ సత్యసాయి ట్రస్ట్ ద్వారా కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఆస్పత్రి అందుబాటులోకి వస్తే కేన్సర్ బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ గోళి ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మీశ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలచందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవికుమార్, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

8 కాళ్ల గొర్రెపిల్ల జననం


ఎనిమిది కాళ్లతో జన్మించిన గొర్రె పిల్ల

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ఇంద్రియాల గ్రామ వాసి అయిన పావానపు నాగేశ్‌కు చెందిన గొర్రె సోమవారం మొదటి ఈతలో 8 కాళ్లు, తల కల్గిన గొర్రెపిల్లకు జన్మనిచ్చింది. కానీ కొద్దిసేపటికే ఆ గొర్రెపిల్ల మృతిచెందింది. అయితే జన్యు సంబంధ మార్పులతో అప్పుడప్పుడు ఇలా జరుగుతుందని పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో చోరీ


ఆలయంలో హుండీని పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల అయ్యప్ప ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీ పగులగొట్టి భక్తులు సమర్పించిన కానుకలు, నగదును అపహరించుకుపోయారు. ఆలయ నిర్వాహకుల సమచారం మేరకు పోలీసులు ఆలయాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

కూరెళ్ల విఠలాచార్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్

- ఫర్నిచర్, నిత్యావసర వస్తువులు దగ్ధం

రామన్నపేట: మండల పరిధిలోని వెల్లంకి గ్రామానికి చెందిన మధురకవి, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ఇంట్లో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో కూరెళ్ల సోదరి, పనిమనిషి మాత్రమే ఉన్నారు. మంటలకు కిటికీల అద్దాలు పగిలి చప్పుడు రావడంతో బయట హాల్‌లో పడుకున్న వారు దొంగలు అనుకొని గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి వెనుక గదిలో మంటలు లేచి పొగరావడం గమనించారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి నీళ్లతో మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, చౌటుప్పల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో బీరువాల్లోని దుస్తులు, ఫర్నిచర్, నిత్యావసర వస్తువులు, విలువైన ఫొటోలు కాలి బూడిదయ్యాయి. ప్రతిరోజు ప్రమాదం సంభవించిన గదిలోనే నిద్రించే కూరెళ్ల సోదరి హాల్‌లో ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాద విషయం తెలుసుకున్న పలువురు కూరెళ్లను పరామర్శించారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో . ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.అంతేగాక క్షేత్రంలోని శివాలయంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ. నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, శ్రీనివాసాచార్యులు,పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు,బ్రహ్మాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- పాల తయారీలో హానికర రసాయనాలు వాడుతున్న అక్రమార్కులు
- నీటిని కూడా కల్తీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- నిత్యావసరాల కల్తీకి కేరాఫ్‌గా మారుతున్న బీబీనగర్
- తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు


నెమురుగొముల పరిధిలో బయటపడిన కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ (ఫైల్)


బ్రాండెడ్ కంపెనీల పేరుతో ఉన్న బాటిళ్లలో మామూలు వాటర్‌ను నింపి అమ్ముతున్న అక్రమార్కులు (ఫైల్)

బీబీనగర్: అధికారుల ఉదాసీన వైఖరిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. సంపాదనే ధ్యేయంగా తాగే నీటి నుంచి పాలు, అల్లం తదితర నిత్యావసరాలను కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. బీబీనగర్ మండలం హైదరాబాద్ దగ్గరగా ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు పాలను కల్తీ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కల్తీ పదార్థాలను మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లతో పాటు హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. దీంతో బీబీనగర్ మండలం రోజురోజుకు కల్తీకి కేరాఫ్‌గా మారుతోంది. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామంలో కల్తీ పాల తయారీ ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.

శవాలను భద్రపరిచే కెమికల్ కలుపుతూ..

గతంలో మండలంలోని బీబీనగర్, జైనపల్లి, కొండమడుగు గ్రామాల్లోని కొందరు అక్రమార్కులు పొలాల్లో చల్లే యూరియా వాడి పాలను కల్తీ చేసేవారు. ఇప్పుడు ఏకంగా మనుషుల శవాలను భద్రపరిచేందుకు వాడే ఫార్మాల్డిహైడ్ కెమికల్‌ను కలుపుతుండటాన్ని ఫుడ్ సెక్యూరిటీ అధికారులు తాజాగా మండలంలోని మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌తో చేపట్టిన తనిఖీల్లో బయటపడింది. కొండమడుగు గ్రామంలోని ఓ పాల వ్యాపారి తన పాల సేకరణ సెంటర్‌లో పాలు పగలకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండే విధంగా మార్చురీల్లో మృతదేహాలు కుళ్లిపోకుండా వాడే ఫార్మాల్డిహైడ్ కెమికల్‌ను వాడుతున్నట్లు తేలింది. దాంతో పాటు పాలల్లో నీళ్లతో పాటు సుక్రోజ్, అమ్మోనియం సల్ఫేట్‌ను కలిపి అధికంగా పాలను తయారుచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అల్లం, నీళ్ల బాటిళ్లు సైతం

పాల కల్తీతో పాటు కూరల్లో వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్ సైతం కల్తీ చేసి విక్రయించడాన్ని గతంలో నెమురగొముల గ్రామ పరిధిలో పోలీసులు గుర్తించారు. కుళ్లిపోయిన అల్లం, ఎల్లిగడ్డలను మిషన్లలో వేసి అది పాడవకుండా పేస్ట్‌లో కెమికల్‌ను వాడుతున్నట్లు తేలింది. అలాగే బీబీనగర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు విక్రయించే వాటర్ బాటిళ్ల విషయంలో చిరు వ్యాపారులు కల్తీకి పూనుకున్నారు. కిన్లీ, బిస్లరీ స్టిక్కర్లతో కూడిన వాటర్ బాటిళ్లను సేకరించి వాటిలో మామూలు వాటర్‌ను నింపి విక్రయించారు. ఈ విషయాన్ని పోలీసులు గతంలో వెలుగులోకి తెచ్చారు. ఇలా మండలంలో ఒకదాని తర్వాత మరొకటి కల్తీ వ్యాపారం బయటపడుతోంది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కల్తీ జరగకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

గ్రామాల్లో పాల కల్తీకి పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు తనిఖీలను ముమ్మరం చేస్తాం. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడేలా కల్తీ పాలు తయారు చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేయిస్తాం. పాలు, ఇతర ఫుడ్ తయారీకి సంబంధించిన విషయాల్లో అనుమానం వస్తే మాకు సమాచారం ఇవ్వాలి. – జ్యోతిర్మయి, జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

సాగర్ కాల్వలో పడి విద్యుత్ ఏఈ మృతి


వరుణ్ (ఫైల్)


ఎడమ కాల్వలో లభ్యమైన వరుణ్ మృతదేహం

మిర్యాలగూడ: ప్రమాదవశాత్తు సాగర్ ఎడమకాల్వలో పడి విద్యుత్ ఏఈ మృతిచెందిన ఘటన శనివారం రాత్రి వేములపల్లి మండల శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన కొమ్మరి వరుణ్(27) మిర్యాలగూడ విద్యుత్ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి 10గంటల సమయంలో స్కూటీపై ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు ఆదివారం ఉదయం వరకు తిరిగి రాలేదు. దీంతో అతడి తల్లి విజయలక్ష్మి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. ఆమె ఆందోళన చెంది వరుణ్ మేనమామ శ్రీరంగం నరేష్‌కు విషయం తెలపగా అతడు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. అదే సమయంలో వరుణ్ స్నేహితుడు అబ్దుల్ రషీద్ వేములపల్లి మండల కేంద్రం శివారులోని సాగర్ ఎడమకాల్వపై అన్నపరెడ్డిగూడేనికి వెళ్లే వైపు వరుణ్ స్కూటీ, చెప్పులు ఉండడాన్ని గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు కాల్వ పక్కన ఉన్న స్కూటీ, చెప్పులు వరుణ్‌వేనని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వరుణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా సూర్యాపేట జిల్లా మునగాల శివారులో ఆదివారం సాయంత్రం సాగర్ ఎడమకాల్వలో ఓ మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమచారం ఇచ్చారు. ఈ మేరకు వరుణ్ కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని అది వరుణ్ మృతదేహమేనని గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వేములపల్లి ఎస్‌ఐ శ్రీను తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడు మేనమామ శ్రీరంగం నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బత్తిని భాస్కర్ రోజుమాదిరిగా ఆదివారం ఉదయం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. దీంతో అతడి కుడి కాలు విరిగింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కాల్వలో గల్లంతైన యువకుడు


కళ్యాణ్ చక్రవర్తి

పెన్‌పహాడ్: సంక్రాంతి పండుగకు సొంతూరికి వచ్చిన యువకుడు సాగర్ ఎడమ కాల్వలో గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన మామిడి సైదులు, వసంత దంపతుల పెద్ద కుమారుడు కళ్యాణ్ చక్రవర్తి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో గడుపుదామని సంక్రాంతి పండుగకు సొంతూరికి వచ్చిన అతడు ఆదివారం తన స్నేహితుడితో కలిసి పక్కనే ఉన్న అన్నారం గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాల్వ వద్దకు బహిర్భూమి కోసం వెళ్లిన సమయంలో కాల్వలో జారిపడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం కూడా కళ్యాణ్ చక్రవర్తి ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ నెమ్మాది భిక్షం, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆటోకు నిప్పుపెట్టిన దుండగులు


బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ కట్టా వెంకటరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్: గుర్తుతెలియన వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టిన సంఘటన మండల పరిధిలోని మగ్రిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కట్టా వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మగ్రిగూడెం గ్రామానికి చెందిన రడపంగు వెంకటేశ్వర్లు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఏపీ 24 టీసీ 4017 నంబర్ గల ఆటోలో కిరాయికి వెళ్లి వచ్చి రాత్రి 7గంటల సమయంలో తన ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోకు నిప్పుపెట్టారు. ఆటో కాలిపోతుండడం గమనించిన చుట్టుపక్కల వారు కేకలు వేయగా అక్కడికి వచ్చిన గ్రామస్తులు అందరూ కలిసి మంటలను ఆర్పేశారు. ఆటో కాలిపోవడంతో సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

- కట్టంగూరు మండలం అయిటిపాముల శివారులో ఒకరు..
- చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం స్టేజీ వద్ద మరొకరు..
- మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల పరిధిలో మద్దిరాల మండల వాసి మృతి


రాకేష్ మృతదేహం

కట్టంగూర్: అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ అర్బన్ కృష్ణలంక గౌతమీనగర్‌కు చెందిన వలిశెట్టి సాయిసందీప్, తన స్నేహితుడు రాకేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో అయిటిపాముల గ్రామ శివారులోని ఎన్‌టీఆర్ నగర్ వద్దకు రాగానే బైక్‌ను అతివేగంగా నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో బైక్ వెనుక కూర్చున్న రాకేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న సాయిసందీప్‌కు గాయాలైనప్పటికీ రాకేష్‌ను అక్కడే వదిలేసి బైక్‌పై పారిపోయాడు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదని, వయస్సు సుమారు 27 నుంచి 30 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. ఎన్‌టీఆర్ నగర్ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బైక్‌ను సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టడంతో..


భానుప్రకాష్ మృతదేహం

చౌటుప్పల్: మండల పరిధిలోని కుంట్లగూడెం గ్రామ స్టేజీ వద్ద చౌటుప్పల్–వలిగొండ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం నెమలికాలువ గ్రామానికి చెందిన వంగాల భానుప్రకాష్‌గౌడ్(30) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. ఈ నెల 14న రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన నెమలికాలువకు వెళ్లి తిరిగి వస్తుండగా క్రమంలో కుంట్లగూడెం గ్రామ స్టేజీ సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్ లారీ బైక్‌ను ఢీకొట్టి అతడి మీది నుంచి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన భానుప్రకాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు రమాకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

రెండు బైకులు ఢీకొనడంతో..


ప్రవీణ్ (ఫైల్)

మద్దిరాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం గ్రామానికి చెందిన వల్లపు కోమరయ్య, సోమలింగమ్మ దంపతుల చిన్న కుమారుడు వల్లపు ప్రవీణ్(21) ఆదివారం అదే గ్రామానికి చెందిన తన స్నేహితులు యశ్వంత్, సాయితో కలిసి బైక్‌పై మహబూబాబాద్ జిల్లా పరిధిలోని తొర్రూర్ మండల కేంద్రంలో సినిమా చూసేందుకు వెళ్లాడు. సినిమా ముగిసిన అనంతరం తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో తొర్రూర్ మండల పరిధిలోని మాటేడు గ్రామశివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను వీరు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందగా, అతడి స్నేహితులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ముగ్గురిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికందొచ్చిన కుమారుడి అకాల మరణంతో ప్రవీణ్ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

చిన్ననాటి స్నేహం ఎప్పటికీ మరువలేనిది

- సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి


స్నేహితులను సన్మానిస్తున్న కుందూరు జానారెడ్డి

మిర్యాలగూడ: చిన్ననాటి స్నేహం ఎప్పటికీ మరువలేనిదని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో 60వసంతాల స్నేహ వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మిర్యాలగూడలో 1959–65లో తనతో పాటు చదువుకున్న స్నేహితులను కలుసుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. తాను విద్యాభ్యాసం పూర్తిచేసి రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకుంటున్న సమయంలో మిత్రులు ఎన్నో విధాలుగా చేయూతనందించడంతో తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. తాను మొదటిసారి గెలిచిన సమయంలో తన మిత్రుడు రామానుజాచార్యులు నేను మంత్రిని అవుతానని జోస్యం చెప్పగా.. ఎన్‌టీఆర్ హయాంలో మంత్రిగా పనిచేశానని గుర్తుచేశారు. కార్యక్రమంలో జానారెడ్డి మిత్రులు ముడుంబై రామానుజాచార్యులు, సీడీ. రవికుమార్, పి. సుబ్బారావు, చెన్నూరి రంగారావు, పి. రాములు, ఎస్. లచ్చయ్య, ప్రేమయ్య, సుదర్శన్, శ్రీనయ్య, ఇంద్రసేనారెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, మట్టారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ వైపు బారులుదీరిన వాహనాలు

- సంక్రాంతి పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణమవుతున్న ప్రజలు


చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ వైపు బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ ముగియడంతో ఆంధ్రా ప్రాంతానికి వెళ్లిన వారంతా హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హైదరాబాద్ వైపు వాహనాల రద్దీ నెలకొంది. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు, జీఎమ్మార్ సిబ్బంది ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. మొత్తం 16 టోల్ కౌంటర్లకు గాను హైదరాబాద్ వైపే 10 కౌంటర్లు తెరిచి వాహనాలను పంపిస్తున్నారు. అదేవిధంగా హైవేపై వివిధ గ్రామాల కూడళ్లలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీతో పట్టణ కేంద్రంలో వాహనదారులు, ప్రజానీకం రోడ్డు దాటేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది


మహిళ భర్తకు బ్యాగు అందజేస్తున్న కోదాడ ఆర్టీసీ సిబ్బంది

కోదాడఅర్బన్: ప్రయాణికురాలు బస్టాండ్‌లో పోగొట్టుకున్న పది తులాల బంగారం, రూ.2 వేల నగదు ఉన్న బ్యాగును తిరిగి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది తమ నిజాయితీ చాటుకున్నారు. సోమవారం కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ తన బ్యాగును మరిచి ఖమ్మం బస్సు ఎక్కింది. అయితే ఆమె ఖమ్మం చేరుకున్న తర్వాత బ్యాగు పోయిందని గుర్తించింది. దీంతో ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో ఆమె భర్త పిట్టల కిరణ్‌బాబు కోదాడ ఆర్టీసీ డిపోకు వెళ్లి అధికారులను సంప్రదించారు. దీంతో సిబ్బందికి దొరికిన బ్యాగును ఆయనకు డిపో మేనేజర్ సైదులు అందజేశారు.

చెక్‌డ్యాంలో పడి వ్యక్తి మృతి

ఆత్మకూరు ఎం: ప్రమాదవశాత్తు బిక్కేరు వాగు చెక్‌డ్యాంలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని రహీంఖాన్‌పేటలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన యేసు పదిహేనేళ్ల క్రితం రహీంఖాన్‌పేట గ్రామానికి వలస వచ్చి ఇక్కడే ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా యేసు ఇంటికి ఆదివారం హైదరాబాద్ నుంచి బంధువులు వచ్చారు. వీరితో పాటు ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన కోటేష్(45) అనే వ్యక్తి కూడా వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు అందరూ కలిసి గ్రామంలోని బిక్కేరు వాగు అవతలి వైపునకు కల్లు తాగడానికి వెళ్లారు. అందరూ కలిసి కల్లు తాగుతున్న క్రమంలో కోటేష్ బహిర్భూమికి అని చెప్పి చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. చాలాసేపటి వరకు అతడు రాకపోయేసరికి, కుటుంబ సభ్యులు వెళ్లి వెతికారు. ఆ తర్వాత కోటేష్ చెక్ డ్యాంలో శవమై పైకి తేలియాడాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

19న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సమావేశం

చిట్యాల: ఈ నెల 19న చిట్యాలలో నిర్వహించనున్న ఎంఎస్‌పీ (మహాజన సోషలిస్ట్ పార్టీ), ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా సమావేశం జరగనుందని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ పేర్కొన్నారు. చిట్యాలలో సోమవారం జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ సమావేశానికి పార్టీ, సంఘం ముఖ్య నాయకులంతా తరలి రావాలని కోరారు. ఎంఎస్‌పీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు యాతాకుల రాజన్న, నల్ల చంద్రస్వామి, బోడ సునీల్, ఎరిగి శ్రీశైలం, గట్టు మల్లయ్య, బుజ్జ సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాజేయాలని..

- జప్తివీరప్పగూడెం వద్ద 20 ఎకరాలు కబ్జాకు రియల్టర్ల ప్రయత్నాలు
- ట్రస్ట్ ఏర్పాటుకు అనుమతించాలని కేంద్రంలోని పెద్దలకు అర్జీలు
- ఇప్పటికే షుగర్ కంపెనీ కోసం కొన్న భూముల్లో వెలిసిన వెంచర్
- సమీప భూముల్లోనూ పాగావేసినా పట్టించుకోని అధికారులు


జప్తివీరప్పగూడెం వద్ద షుగర్ కంపెనీ ఏర్పాటు చేస్తామని కొన్న భూమిలో వెలిసిన వెంచర్

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కొందరు రియల్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే సదరు భూమిలో పాగా వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కేంద్రంలోని పెద్దలను కలిసి ఇక్కడ ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని, దీనికి అనుమతి ఇవ్వాలని అర్జీలు సైతం పెట్టుకున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అసలు ఏమి జరిగిందంటే..

జప్తివీరప్పగూడెం గ్రామ శివారులోని సర్వే నంబర్ 216 నుంచి 224 వరకు ఉన్న పట్టా భూముల్లో కోరమండల్ షుగర్ లిమిటెడ్ చెన్నయ్ పేరుతో పరిశ్రమను ఏర్పాటు చేస్తామని కొందరు వ్యాపారులు 20 సంవత్సరాల క్రితం 110 ఎకరాల వ్యవసాయ భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఆ సమయంలో భూములు అమ్మే రైతులకు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి వారినుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. అయితే ఆ భూముల్లో షుగర్ కంపెనీ పెట్టకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. చివరికి పరిశ్రమ ఏర్పాటు కాక, ఉద్యోగాలు రాక భూములు అమ్మిన రైతులు నిలువునా మోసపోయారు.

ప్లాట్లుగా మారిన వ్యవసాయ భూమి..

గ్రామంలో షుగర్ కంపెనీ కోసం కొనుగోలు చేసిన 110 ఎకరాల భూమిలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వెంచర్ వెలిసింది. ఆ భూమికి ఎలాంటి డీటీసీపీ అనుమతి రాకముందే ప్లాట్లు చేసి కాగితంపైనే విక్రయిస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. కాగా మొదటగా 30 ఎకరాల్లో వెంచర్ వేసిన రియల్టర్లు మిగిలిన 80 ఎకరాల భూమిని కూడా ప్లాట్లుగా మార్చి ప్రజలకు మోస పూరితంగా అమ్మాలని చూస్తున్నారు.

ప్రభుత్వ భూమిపై రియల్టర్ల కన్ను..

అయితే రైస్ ఇండస్ట్రీస్‌కు పేర్కొంచి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమానంగా ఇక్కడ భూములకు ధర పలుకుతుంది. దీంతో పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కొన్న భూములకు ఆనుకొని ఉన్న దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ భూమిపై రియల్ వ్యాపారుల కన్ను పడింది. ఇంకేముంది ఏంచక్కా ఆ భూమిని కబ్జా చేసి స్వామి నారాయణ ట్రస్ట్ పేరుతో అందులో వెంచర్ వేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్, కార్పొరేట్ ఆస్పత్రి నిర్మిస్తామని ప్రచారం చేస్తూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమి కబ్జా విషయంపై సంబంధిత మండల అధికారుల వివరణ కోసం పలుమార్లు ఫోన్‌లో ప్రయత్నించినా స్పందించడం లేదు.

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు అనుమతి లేదు

మండలంలోని జప్తివీరప్పగూడెం గ్రామంలో సర్వే నంబర్ 214లో ఉన్న ప్రభుత్వ భూమిని రైతులు సాగు చేసుకోకుంటే స్వాధీనం చేసుకుంటాం. ఈ భూమి అమ్మడానికి, కొనడానికి ఎవరికి హక్కులు లేవు. అసైన్డ్ భూమిని రైతులు సాగు చేసుకొని ఉపాధి పొందాలే తప్ప విక్రయించేందుకు నిబంధనలు ఒప్పుకోవు.
– అనిల్‌కుమార్, తహసీల్దార్, మిర్యాలగూడ

డీటీసీపీ అనుమతులు రాలేదు

జప్తివీరప్పగూడెంలో చేసిన వెంచర్‌కు ఇంకా డీటీసీపీ అనుమతులు రాలేదు. కేవలం 30 ఎకరాలకు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. డీటీసీపీ అనుమతి రావాలంటే గ్రామ పంచాయతీకి 10శాతం భూమి రిజిస్ట్రేషన్ చేయాలి. లే అవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలి. ఇవి చేసే వరకు వెంచర్‌లో 15శాతం భూమిని పంచాయతీకి మార్ట్‌గేజ్ చేయాల్సి ఉంటుంది. అనుమతులు లేకుండా ప్లాట్లు చేస్తే చర్యలు తీసుకుంటాం.
– వీరారెడ్డి, ఎంపీఓ, మిర్యాలగూడ